సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం, 4, జూలై, 2023



ఆన్‌లైన్ చెల్లింపును ప్రోత్సహించాలి

ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపును ప్రోత్సహించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు సూచించారు.

- 8లో



జాతర ఏర్పాట్లకు ముందస్తు కార్యాచరణ

- 8లో

ఫిబ్రవరిలో జరుగనున్న మేడారం మహాజాతర విజయవంతానికి ముందస్తు కార్యాచరణ చేపడుతున్నామని మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం $33.0^0/24.0^0$

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరుజల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

ఉద్యమకారులను విస్మరించడం బాధాకరం

భూపాలపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించడం బాధాకరమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు యాదండ్ల గట్టయ్య యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జార్ఖండ్ రాష్ట్రంలో అక్కడి ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి గౌరవ వేతనం ఇస్తుందన్నారు. రాష్ట్రంలో ఉద్యమకారులకు హెల్త్ కార్డు, బస్సుపాస్, 300 గజాల ఇంటి స్థలం, డబుల్ బెడ్ రూం ఇళ్లు, దళిత బంధు, బీసీ రుణాల లాంటి వాటిలో వాటాను కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తిచేశారు. నామినేటెడ్ పోస్టులలో ఉద్యమకారులకు అవకాశాలు కల్పించాలని కోరారు.

మిగులు భూమి సేకరించాలని వినతి



మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో ఓసీపీ ఏర్పాటులో భాగంగా ప్రాజెక్టుకు అవతలి వైపు ఉన్న మిగులు భూమిని సేకరించాలని పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు ఆధ్వర్యంలో జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుకు రైతులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. తాడిచర్ల శివారులోని 915 సర్వేనంబర్‌లో ఇప్పటికే కొంత మేర భూమి జెన్‌కో అధికారులు సేకరించారని సీఎండీ తెలియజేశారు. ప్రస్తుతం మిగిలిన భూమిని తాము సాగు చేయడానికి ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆయనకు వివరించారు. సదరు భూమి తీసుకోవాలని ఈ సందర్భంగా రైతులు విజ్ఞప్తి చేశారు. దీంతో సీఎండీ సానుకూలంగా స్పందించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రైతులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు, రైతులు బండి శ్రీనివాస్, పన్నాల ఓదెలు, సమ్మయ్య, గట్ల సత్యనారాయణ, నారాయణ, మొగిలి పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి



చిట్యాల: ఈ నెల 8న హనుమకొండలో జరగనున్న బీజేపీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగదీశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం చిట్యాల మండలకేంద్రంలో మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ఉమ్మడి వరంగల్ జిల్లాకు మొదటిసారి వస్తున్న సందర్భంగా పెద్దఎత్తున బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చందుపట్ల సత్యపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు బట్టు రవి, నాయకులు రఘు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, అశోక్‌చారి, శ్రీనివాస్‌గౌడ్, అశోక్, భిక్షపతి, సుందర్, రాజు, స్వామి, రాజేందర్, ప్రవీన్, శ్రీశైలం, తిరుపతి పాల్గొన్నారు.

7న జాబ్‌మేళా

భూపాలపల్లి అర్బన్: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 7వ తేదీన శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి శ్యామల సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని శ్రీరామ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో పనిచేసేందుకు బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌ల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ, బీటెక్ పూర్తిచేసిన 23 సంవత్సరాల నుంచి 33 సంవత్సరాలలోపు నిరుద్యోగులు హాజరుకావచ్చని సూచించారు. వివరాలకు 98487 11676, 77024 57968 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన 1, 5వ తరగతుల విద్యార్థుల నుంచి బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాలకు ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి సునిత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో సెయింట్ పీటర్ హైస్కూల్, కాటారంలో ఆదర్శ, వివేకనంద, సువిద్య పాఠశాలల్లో 1వ తరగతికి 41 సీట్లు, 5వ తరగతికి 43 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు దరఖాస్తు ఫారాలను కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

బాల్యంపై బరువు



పెరుగుతున్న పుస్తకాల మోత

- ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులకు మరింత బరువు బ్యాగులు
- అధిక బరువుతో వంగిపోతున్న విద్యార్థులు

భూపాలపల్లి అర్బన్: బాల్యం భవిష్యత్‌పై పుస్తకాల భారం పెరుగుతోంది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ సొంత సిలబస్‌తో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ సంఖ్య పెంచేస్తున్నాయి. దీంతో బ్యాగుల బరువు మోయలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పుస్తకాలకు తోడు టిఫిన్‌బాక్స్, వాటర్‌బాటిల్, బూట్లు తదితర వస్తువులు మరింత భారంగా మారుతున్నాయి. పిల్లల బాధ చూడలేక చాలామంది తల్లిదండ్రులు పాఠశాల వరకు బ్యాగులు మోసుకెళ్లి దిగబెట్టి వస్తున్నారు. పుస్తకాల బరువుపై ప్రభుత్వం ఐదేళ్ల క్రితమే మార్గదర్శకాలు జారీచేసినప్పటికీ యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. ప్రతీ ఏడాది మాదిరిగానే కొనుగోలు చేయాల్సిన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ జాబితాను తల్లిదండ్రులకు ఇస్తున్నారు. దీంతో విద్యార్థులకు పుస్తకాల మోత తప్పే పరిస్థితి కనిపించడం లేదు.

పెరిగిన పుస్తకాల బరువు

జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు 75 ఉన్నాయి. వాటిలో సుమారు 15వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలల్లో ఒకప్పుడు ఆరు సబ్జెక్టులకు ఆరు నోట్‌బుక్స్‌తో పాటు ఒక రఫ్‌బుక్ ఉండేది. కానీ ఇప్పుడు సబ్జెక్టుకు ఒక రఫ్ బుక్‌తోపాటు గైడ్లు, డ్రాయింగ్, స్క్రాప్ బుక్స్, రికార్డులు, డైరీలని స్కూల్ బ్యాగుల్లో కిలోల కొద్ది పుస్తకాలు మోసుకెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు 6నుంచి 12కిలోల బరువైన బ్యాగులు, ఉన్నత పాఠశాలల విద్యార్థులు 12నుంచి 17కిలోల బ్యాగులను ప్రతి రోజు వీపు మీద మోస్తున్నారు. రోజు ఇంతింత బరువులు మోయడం, ఒకటి, రెండు అంతస్తుల మేడలు ఎక్కి క్లాస్‌రూం వరకు వెళ్లడం కారణంగా చాలా మంది పిల్లలు వెన్నునొప్పి, జాయింట్ పెయిన్స్ భారినపడుతున్నారు. ఇది విద్యార్థుల శారీరక ఎదుగుదలపై ప్రభావం చూపుతోంది.

ప్రభుత్వ మార్గదర్శకాలివే..

చిన్నారులకు కిలోల కొద్దీ బ్యాగుల మోతను తగ్గించేలా రాష్ట్ర విద్యాశాఖ 2017లో మార్గదర్శకాలు జారీచేసింది. వాటి ప్రకారం ఒకటి, రెండో తరగతుల పుస్తకాల బరువు బ్యాగుతో సహా 1.5కిలోలు మాత్రమే ఉండాలి. ప్రస్తుతం జిల్లాలోని పాఠశాలలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, ఒకటి, రెండు తరగతుల పిల్లల బ్యాగులే సుమారు 8నుంచి 12కిలోల బరువు ఉంటున్నాయి. మూడు, నాలుగు, ఐదు తరగతులకు 3 కిలోలు, ఆరు, ఏడు తరగతులకు 4 కిలోలు, ఎనిమిది తొమ్మిది, పదో తరగతులకు నాలుగున్నర నుంచి 5 కిలోల వరకు మాత్రమే బ్యాగు బరువు ఉండాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ నిబంధనలకు గత విద్యాసంవత్సరం నుంచే అమలు చేయాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యాలు పట్టించుకోవడంలేదు. ఈ సారైనా ఈ మార్గదర్శకాలు అమలు చేసేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అమలు చేయాల్సిందిలా..

ఆరు, ఏడు తరగతులకు మూడు లాంగ్వేజ్ బుక్స్‌తో పాటు గణిత, సామాన్యశాస్త్రం, సాంఘీకశాస్త్రం, సహా మొత్తం ఆరు పుస్తకాలే ఉండాలి. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతులకు ఈ ఆరు పుస్తకాలతో పాటు జీవశాస్త్రం కలిపి ఏడు పాఠ్యపుస్తకాలు ఉండాలి. ప్రతి సబ్జెక్టుకు 200 పేజీల నోట్‌బుక్ మాత్రమే ఉపయోగించాలి. వాటిని ఎఫ్‌ఏలకు, స్లిప్‌టెస్టులకు వినియోగించాలి. ఇవి కూడా రోజు తీసుకురావాల్సిన అవసరం లేదు. పాఠ్యాంశాల చివరన ఉన్న ఎక్సర్‌సైజ్‌లను ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పాఠశాలల్లోనే పూర్తిచేయాలి. ఇందుకోసం ప్రత్యేక పీరియడ్లను కేటాయించాలి. ఆరు నుంచి పదో తరగతుల విద్యార్థులకు హోంవర్క్ కోసం ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో రోజు కేటాయించేలా ప్రణాళిక ఉండాలి. ఏ సబ్జెక్టుకు ఏ రోజు అనేది ఉపాధ్యాయుల ఏయే పాఠ్య పుస్తకాలు, నోటుబుక్స్ తెచ్చుకోవాలో టీచర్లు ముందుగానే చెప్పాలి. స్టేట్ సిలబస్‌ను అమలుచేసే అన్ని పాఠశాలలు రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి నిర్ణయించిన పుస్తకాలనే వినియోగించాలి. అంతకుమించి అదనపు పుస్తకాలేవీ ఉపయోగించకూడదు.

సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించాలి

ఎస్పీ సురేందర్‌రెడ్డి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ సురేందర్‌రెడ్డి

భూపాలపల్లి: ప్రజల సమస్యలను జిల్లాలోని పోలీసు అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలని ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాదివస్ కార్యక్రమం సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన 17మంది ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడారు. బాధితులకు అండగా ఉంటూ, సమగ్ర విచారణ జరిపి ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు పరిధిలోని ప్రతీ అంశాన్ని పరిష్కరించడంతో పాటు బాధితులకు న్యాయం చేయడంలో సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులు భూ పంచాయతీలు, సివిల్ పంచాయతీలు సాధ్యమైనంత వరకు కోర్టులో పరిష్కరించుకోవాలని ఎస్పీ సురేందర్‌రెడ్డి సూచించారు.

గురుపౌర్ణమి వేడుకలు



దత్తాత్రేయస్వామికి క్షీరాభిషేకం..



పాల్గొన్న భక్తులు, ధర్మకర్తలు

కాళేశ్వరం: గురుపౌర్ణమి సందర్భంగా కాళేశ్వరంలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఆలయంలో స్వామివారి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలతో అలంకరించారు. నూతన పట్టువస్త్రాలు ధరించారు. అర్చకులు ప్రత్యేకంగా అభిషేకం, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ మహేష్, సర్పంచ్ వసంత, ఎంపీటీసీ మమత, ధర్మకర్తలు సమ్మయ్య, రాంరెడ్డి, రాజయ్య, దేవుడా శ్యాంసుందర్, దేవేందర్, సిద్ధాంతి భానుప్రకాశ్ పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ డబ్బులు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పెన్షన్ డబ్బులను సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డుకు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంపెటి రాజయ్య డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 నుంచి 2020 వరకు పెన్షన్ డబ్బులు చెల్లించకుండా సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కార్మికులకు బ్యాంకు వివరాలు, పాస్ పుస్తకాలు ఇవ్వాలని రాజయ్య కోరారు. ధర్నా అనంతరం ఎస్ఓటు జీఎం వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, నాయకులు సారయ్య, సుధాకర్, లక్ష్మి, మొగిలిచ సంపత్, మదునమ్మ, స్వామి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి



రైతుకు పంట నష్టం చెక్కును ఇస్తున్న శ్రీహర్షిణి

మల్హర్: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని జెడ్పీచైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి అన్నారు. మండలంలోని నాచారం గ్రామంలో పంట నష్ట పరిహారం చెక్కులను సోమవారం ఆమె రైతులకు అందించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు, రైతుబీమా పథకాలను దేశంలో గొప్పవన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సాయం అందజేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాసాని రామయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సబ్ రిజిస్ట్రార్ తస్లీమా



మొక్క అందిస్తున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా

భూపాలపల్లి రూరల్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ప్రకృతిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్ అన్నారు. సోమవారం వివాహ రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన నూతన దంపతులకు సర్టిఫికెట్‌తో పాటు మొక్క అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న జీవన విధానంలో చెట్లు అంతరించిపోయాయని.. దీంతో వాతావరణంలో కాలుష్యం పెరిగి ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని తస్లీమా కోరారు.



భద్రకాళీ.. శరణం మమ

మహాశాకంబరిదేవిగా దర్శనం..

చారిత్రాత్మక శ్రీభద్రకాళి దేవాలయంలో తిథిమండల దేవాతాయజన పూర్వక శాకంబరి నవరాత్రోత్సవాల చివరిరోజు సోమవారం ఉదయం అమ్మవారిని మహాశాకంబరిదేవిగా అలంకరించారు. అలంకరణలో నాలుగు టన్నుల కూరగాయలు, పండ్లు, దుంపలను వినియోగించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. గత నెల 19వ తేదీ ఆషాఢ శుద్ధ పాడ్యమి సోమవారం ఉత్సవాలు ప్రారంభమై పక్షం రోజులుగా ఒక్కో క్రమంలో పూజలందుకుంటూ ఆషాఢ శుద్ధ పౌర్ణమి సోమవారం అమ్మవారు పరిపూర్ణ శాకంబరిదేవిగా భక్తులను అనుగ్రహించింది.

- వివరాలు 8లో

పకడ్బందీగా ప్రభుత్వ కార్యక్రమాల అమలు

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి: ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి తెలంగాణకు హరితహారం, గృహలక్ష్మి, సీఎంఆర్, బీసీ కులవృత్తులకు ఆర్థిక సహాయం, గొర్రెల పంపిణీ, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై కలెక్టర్లతో సీఎస్ వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ.. జిల్లాలో జూలై మాసం చివరి వరకు 1,700ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. వచ్చే 2, 3 వారాల పాటు క్షేత్రస్థాయిలో రైతులకు విస్తృత ప్రచారం నిర్వహించి లక్ష్యం మేర సాగు పూర్తిచేస్తామన్నారు. ప్రభుత్వం అందించే వివిధ సబ్సిడీలను వివరిస్తామని చెప్పారు. జిల్లాలో క్లస్టర్ల వారీగా లక్ష్యాలు నిర్దేశించుకొని మరింత ఆయిల్ పామ్ సాగు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర, జేసీ స్వర్ణలత, డీఎఫ్ఓ భూక్యా లావణ్య, డీఆర్‌డీఓ పురుషోత్తం, డీఏఓ విజయభాస్కర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి రంగారావు, డీపీఓ ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

భూపాలపల్లి: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 56 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

కాళేశ్వరాలయంలో ఏఎమ్మార్ ఎండీ పూజలు



పూజలు చేస్తున్న మహేష్‌రెడ్డి దంపతులు

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ ఏఎమ్మార్ కంపెనీ ఎండీ మహేష్‌రెడ్డి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారిని శాలువాతో సన్మానించి తీర్థప్రసాదం అందజేశారు. వారి వెంట ఏఎమ్మార్ ప్రతినిధులు, మల్హర్ ఎస్సై నరేష్ ఉన్నారు.

పట్టాలు ఇవ్వాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, గుడిసెవాసులు

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు బందు సాయిలు మాట్లాడుతూ.. పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుడిసె వాసులందరికీ 125 గజాల స్థలం కేటాయించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆవాస్ యోజన పథకం వర్తింపచేసి రూ.10లక్షలు మంజూరు చేయాలన్నారు. కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమాచార హక్కు చట్టం అమలు జరగడం లేదన్నారు. దళిత, గిరిజనులపై దాడులు జరుగుతున్నాయని.. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తూ పేదలపై భారాలు మోపుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రజినీకాంత్, రాజేందర్, శ్రీకాంత్, ఓదెలు, దేవేందర్, రమేష్, మల్లయ్య, రాజయ్య, శ్రావణ్ పాల్గొన్నారు.

'టీఎస్ఈఈయూ–327'లో చేరికలు



కండువాలు కప్పుతున్న నాయకులు

గణపురం: గణపురం మండలంలోని చెల్పూరు కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో పలు కార్మిక సంఘాలకు చెందిన ఉద్యోగులు, ఆర్టిజన్ కార్మికులు సోమవారం టీఎస్ఈఈయూ–327 (ఐఎన్‌టీయూసీ)లో చేరారు. టీఎస్ఈఈయూ–327(ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇ.శ్రీధర్ ఆధ్వర్యంలో యూనియన్ చేస్తున్న సేవలను గుర్తించి యూనియన్‌లో చేరినట్లు టీఎస్ జెన్‌కో కంపెనీ రాష్ట్ర అధ్యక్షుడు పి.మాధవరావు అన్నారు. యూనియన్‌లో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. యూనియన్‌లో చేరిన వారిలో కిష్టయ్య, రవి, సందీప్, సన్నిసిద్ధార్థ, సురేందర్, ప్రభాకర్‌తో పాటు సుమారు 50మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఈఈయూ–327 (ఐఎన్‌టీయూసీ) జిల్లా అధ్యక్షుడు కట్ల సదయ్య, నాయకులు ఉమాదేవి, శ్రీనివాస్ రెడ్డి, ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎర్రబెల్లికి కేసీఆర్ ఆశీస్సులు..



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల: పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన జన్మదినాన్ని (మంగళవారం) పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్.. మంత్రి ఎర్రబెల్లికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందించారు. అలాగే కేబినేట్ సమావేశం అనంతరం బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిండెంట్, మంత్రి కేటీఆర్ కూడా మంత్రి ఎర్రబెల్లి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఏటా తన జన్మదిన వేడుకలను విదేశాల్లో జరుపుకుంటున్న మంత్రి దయాకర్‌రావు.. సోమవారం రాత్రి అమెరికా బయలుదేరారు.

బీసీలు ఎదగకుండా కుట్ర..



మాట్లాడుతున్న కూరపాటి వెంకటనారాయణ

నయీంనగర్: బీసీలు రాజకీయంగా ఎదగకుండా కుట్రలు జరుగుతున్నాయని తెలంగాణ బీసీ సంఘాల ఉద్యమకారులు అన్నారు. ఈ మేరకు సోమవారం హన్మకొండ హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇందూర్ జిల్లాలో కొందరు బీఆర్‌ఎస్ నాయకులు.. బీసీ కులాలను కించపరిచేలా వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ముదిరాజ్ కుటుంబాలను సామాజిక బహిష్కరణ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బీసీలు రాజకీయంగా ఎదగకుండా ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి వంటి వారిని ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి రావుల జగదీశ్వర్ ప్రసాద్, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకుడు చందా మల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పాశికంటి రాజేంద్రప్రసాద్, రజక సంఘం నాయకుడు లక్ష్మీనారాయణ, నాయీ బ్రహ్మణ సంఘం నాయకులు నాగవెల్లి సురేష్, బట్టి శ్యాం యాదవ్, తాళ్ల సంపత్, మేర సంఘం నాయకుడు మంద వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహా శాకంబరిదేవిగా దర్శనం..
- ముగిసిన ఉత్సవాలు
- పులకించిన భక్తులు

హోమం మహాపూర్ణాహుతి



సీపీ దంపతులకు శేషవస్త్రాలు అందజేస్తున్న ఈఓ



భద్రకాళీ.. శరణం మమ



అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయంలో శాకంబరీ నవరాత్రోత్సవాల చివరిరోజు సోమవారం ఉదయం అమ్మవారిని మహాశాకంబరిదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని భద్రకాళి శరణం మమ అంటూ పులకించిపోయారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు పార్నంది నరసింహామూర్తి, చెప్పెల నాగరాజుశర్మ , టక్కరసు సత్యం, సోమసుందరశర్మ తదితరులు అలంకరణలో పాల్గొన్నారు. ఉదయం మిత్రాక్రమంలో, చిత్రాక్రమాలలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని మహాశాకంబరీదేవిగా అలంకరించి మహాహారతి, పంచహారతి, మహానివేదన జరిపారు. శాకంబరీ అలంకరణలో ఐదు టన్నుల 80 రకాల దుంపలు, కాయలు, ఆకు కూరలు, కూరగాయలు, 70 రకాల పండ్లను వినియోగించారు. మండువ శేషగిరిరావు, రేణుక దంపతులు, హైదరాబాద్‌కు చెందిన ఈమని హరికృష్ణ , స్మిత దంపతులు శాకంబరీ అలంకరణ దాతలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, సిబ్బంది నాగులు, చింతశ్యామ్ సుందర్, ఇతర సిబ్బంది ఏర్పాట్లను నిర్వహించారు. భద్రకాళి సేవాసమితి అధ్యక్షుడు అయితా గోపినాథ్, సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రముఖుల సందర్శన..

ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ రేవతి దంపతులు, మేయర్ గుండు సుధారాణి దంపతులు, హనుమకొండ జిల్లా న్యాయమూర్తి కృష్ణమూర్తి, నగర సీపీ రంగనాథ్ దంపతులు, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్- పద్మ దంపతులు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ..

- పలువురికి తీవ్రగాయాలు
- క్యాబిన్‌లో చిక్కుకున్న బస్సు డ్రైవర్
- కాపాడిన స్థానికులు
- లారీ డ్రైవర్ పరిస్థితి విషమం



బస్సు డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

దామెర: వేగంగా వచ్చిన ఓ లారీ.. ఆర్టీసీ బస్సును ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం ఉదయం హనుమకొండ జిల్లా దామెర మండలం ఓగ్లాపూర్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పరకాల డిపోకు చెందిన ఏపీ 36 జడ్ 0256 నంబర్‌గల ఆర్టీసీ బస్సు బెల్లంపల్లి నుంచి హనుమకొండకు వెళ్తోంది. హనుమకొండ నుంచి పరకాల వైపునకు వస్తున్న టీఎస్ 07 యూసీ 8979 నంబర్‌గల లారీ ఒగ్లాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై బస్సును ఎదురుగా ఢీకొంది. దీంతో బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా ముందుకు పడ్డారు. ఈ సమయంలో బస్సులో 57 మంది ప్రయాణికులు ఉండగా సుమారు ఏడుగురికి తీవ్రగాయాలు కాగా, మరో 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కావడంతో డ్రైవర్ భద్రయ్యలో క్యాబిన్‌లో ఇరుక్కున్నాడు. పోలీసులు, స్థానికులు సుమారు 20 నిమిషాల పాటు శ్రమించి అతడిని బయటకు తీశారు. అదే విధంగా లారీ డ్రైవర్, ఆర్టీసీ బస్సు డ్రైవర్‌తోపాటు మరో ఐదుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలు కావడంతో 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. స్వల్పగాయాలైన వారిని దామెర క్రాస్‌లోని ఎస్‌ఎస్‌ఆర్ అపోలో రీచ్ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. కాగా, లారీ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. జాతీయ రహదారిపై ప్రమాదం జరగడంతో రహదారికి ఇరువైపులా కిలోమీటర్లమేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో ఎస్సై రాజేందర్ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఘటనా స్థలికి పరకాల ఏసీపీ జూపల్లి శివరామయ్య, పరకాల రూరల్ సీఐ శ్రీనివాసరావు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బస్సు కండక్టర్ భాస్కర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

వివాహితపై లైంగిక దాడి

హసన్‌పర్తి: నగరంలోని భీమారానికి చెందిన ఓ వివాహితపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితురాలు సోమవారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భీమారానికి చెందిన సంగాల ప్రవీణ్, శరత్ లైంగిక దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేయూ పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఖిలా వరంగల్: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి.. ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడాడు. ఈ ఘటన వరంగల్ దూపకుంట రోడ్డులోని గిరిప్రసాద్‌నగర్‌లో జరిగింది. స్థానికులు కథనం ప్రకారం వరంగల్ శంభునిపేట గిరిప్రసాద్‌నగర్‌కు చెందిన ఫహిమా, ఆయూబ్(57) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. పిల్లలందరి వివాహాలు అయ్యాయి. ఈ క్రమంలో ఆర్థికంగా ఇబ్బందులతో మనోవేదనకు గురైన ఆయూబ్ సోమవారం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై సాంబయ్య ఘటనా స్థలిని సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలను సేకరించారు. మృతుడి కుమారుడు అక్బర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య కేసులో మరో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌లో నర్మెట సీఐ నాగబాబుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రామకృష్ణయ్య హత్యకు సహకరించిన గోపాల్‌నగర్ చెందిన పస్తం ధర్మయ్య, పస్తం జగన్నాథంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసు విచారణను వేగవంతం చేస్తున్నామని, త్వరలోనే మరికొంత మందిని కూడా అరెస్ట్ చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రవణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని బంధం..

- గంట వ్యవధిలోనే అన్నదమ్ముల మృతి



కొమురయ్య గౌడ్ (ఫైల్)



సదానందం గౌడ్ (ఫైల్)

ఖిలా వరంగల్: ఒకే తల్లికి జన్మించిన అన్నదమ్ముల అనుబంధం చాలా గొప్పది. అన్న కాలుకి ముల్లుకుచ్చుకుంటే తమ్ముడు.. తమ్ముడి కంట్లో నలుసు పడితే అన్న విలవిలాడుతారు. కష్టసుఖాల్లో ఇరువురు పాలు పంచుకుంటూ అన్యోన్యంగా ఉంటారు. అలాంటి వీరి బంధాన్ని ఎవరూ విడదీయలేరు. చివరకు మరణం కూడా. దీనికి నిదర్శనమే ఈ ఘటన. వరంగల్ గణేశ్‌నగర్‌కు చెందిన ఉమ్మగాని కొమురయ్య గౌడ్ (80), వరంగల్ ఎల్‌బీనగర్ తిలక్ రోడ్డుకు చెందిన ఉమ్మగాని సదానందం గౌడ్ (65) అన్నదమ్ములు. వీరు గీత (గౌడ) వృత్తిని చేపట్టి కుటుంబాలను చక్కగా పోషించుకునేవారు. వారికి జన్మించిన పిల్లలను ఉన్నతంగా చదివించారు. కుమార్తెలు, కుమారుల వివాహం చేయగా వారు ప్రస్తుతం ఉన్నత స్థానంలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో వృద్ధాప్యంలో తాము సంతోషంగా ఉండాలని కోరుకునే సమయాన ఇటీవల అన్నదమ్ములు అనారోగ్యానికి గురయ్యారు. వేర్వేరు ఆస్పత్రుల్లో చిక్సిత పొందారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి కొమురయ్య మృతిచెందగా.. గంట వ్యవధిలోనే తమ్ముడు సదానందం తుది శ్వాస విడిచాడు. దీంతో మరణంలోనూ అన్నదమ్ముల బంధం వీడిపోలేదని పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే నరేందర్ సోమవారం కార్పొరేటర్ గుండేటి నరేందర్‌తో కలిసి మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

జాతర ఏర్పాట్లకు ముందస్తు కార్యాచరణ

- గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్



రెవెన్యూ అతిథిగృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యవతి, జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి

ఎస్‌ఎస్‌తాడ్వాయి : 2024 ఫిబ్రవరిలో జరుగనున్న మేడారం సమ్మక్క- సారలమ్మ మహాజాతర విజయవంతానికి ముందస్తు కార్యాచరణ చేపడుతున్నామని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. పోడు పట్టాల పంపిణీ అనంతరం మేడారంలోని ఐటీడీఏ గెస్ట్ హౌస్‌లో మహాజాతర ఏర్పాట్లు, నిధుల మంజూరుపై రూపొందించిన ప్రతిపాదనలను కలెక్టర్ కృష్ణ ఆదిత్య.. మంత్రి సత్యవతిరాథోడ్‌కు వివరించారు. రూ.75 కోట్లతో మహాజాతర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు ఇంటి పనిగా భావించి మేడారం మహాజాతరను విజయవంతం చేయాలన్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. సీఎం కేసీఆర్‌ను దీవించాలని వనదేవతలను వేడుకున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం మేడారంలో రూ. కోటి 25లక్షలతో నిర్మించిన రెవెన్యూ అతిథిగృహాన్ని జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, అధికారులతో కలిసి ప్రారంభించారు. అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, అధికారులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ అమలు చేయాలి

- మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులకు కేయూ ఎన్జీఓ, నాల్గవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ వినతి



విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయంలో 2013లో నియామకమైన 80 మంది బోధనేతర, ఇతర ఉద్యోగులకు పీఆర్‌సీ అమలు చేయాలని కేయూ ఎన్జీఓ, నాల్గవ తరగతి సంఘాల బాధ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో విద్యాశాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు వినతి పత్ర అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న బోధనేతర, విశ్రాంత ఉద్యోగులకు పీఆర్‌సీ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం 2021 ఆగస్టులో జీవో జారీ చేసిందన్నారు. దీనికి అనుగుణంగా ఉస్మానియా, కాకతీయ, తెలుగు, శాతవాహన, జేఎన్‌టీయూ మహాత్మా గాంధీ, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ, తెలంగాణ, పాలమూరు విశ్వవిద్యాలయాల్లో అమలవుతుందన్నారు. కాని కేయూలో మాత్రం 2013లో నియామకమైన 80 మంది ఉద్యోగులకు వర్తించడం లేదన్నారు. దీనిపై స్పందించి తమకూ వర్తింపజేయడంతోపాటు యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే, ఇవే సమస్యలపై శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేయూ ఎన్జీఓ, నాల్గవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లకావత్ యాదగిరి, వల్లాల తిరుపతి, మహమ్మద్ అబ్దుల్ శుకూర్, పి. కొమురయ్య, ఎతిరాజుల సతీశ్ బాబు, పి. అంకూశ్ పాల్గొన్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత ఎప్పుడు?

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్



మాట్లాడుతున్న గోవిందు నరేశ్

కేయూ క్యాంపస్: జూలై 8వ తేదీన వరంగల్‌కు వస్తున్న ప్రధాని మోదీ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత ఎప్పుడో చెప్పాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్య క్షుడు గోవిందు నరేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కేయూ అతిథి గృహంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి అధ్యక్షతన జరిగిన సంమావేశంలో నరేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎస్సీ వర్గీకరణ విషయంలో చొరవ తీసుకుని ప్రధానితో ప్రకటన చేయించాలని కోరారు. కాగా, ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి ఈ నెల 7వ తేదీతో 29 సంవత్సరాలు అవుతుందన్నారు. ఈ సందర్భంగా 29వ ఆవిర్భావ మహాసభను వరంగల్‌లోని ఓ సిటీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభలో ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి కరుణాకర్, కేయూ ఇన్‌చార్జి వడ్డేపల్లి మధుకర్, ఎంఎస్‌పీ జాతీయ నేత కడార్ల నవీన్ చారి, గోవిందు శాంతి కుమార్, ప్రేమ్ కుమార్, దూడపాక వెంకటేష్, జన్నే భాస్కర్, పెండ్యాల నిశాంత్, ప్రశాంత్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చెల్లింపులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

- ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపులను ప్రోత్సహించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు సూచించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని సీజీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరివికాస్‌లో పెండింగ్ ఉన్న సర్వీసులను సకాలంలో మంజూరు చేయాలన్నారు. అలాగే, కాలిన, ఆగిన మీటర్లను మార్చాలన్నారు. సంవత్సరం పైబడిన వర్క్ ఆర్డర్స్ పూర్తయ్యేలా చూడాలన్నారు. సబ్‌స్టేషన్‌ల నిర్వహణ ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. దత్త గ్రామాల సమస్యలు పరిష్కరించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. అక్రమంగా వినియోగిస్తున్న సర్వీసులను గుర్తించి వాటికి మీటర్లు అమర్చడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.మోహన్ రావు, సి.ప్రభాకర్, కె.కిషన్, కె.ఎస్.గుట్ట, రాజుచౌహాన్, భీకంసింగ్, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరీ కె. రమేష్, కంపెనీ కార్యదర్శి కె.వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడిన రహదారులు..

అతివేగం.. అజాగ్రత్త.. నిర్లక్ష్యం ఫలితంగా రహదారులు రక్తమోడాయి. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అటవీశాఖ అతిథి గృహం వద్ద ద్విచక్రవాహనాన్ని ఓ స్కూల్ బస్సు ఢీకొనదంతో బైక్‌పై ఉన్న ఓ యువకుడు, ఇదే జిల్లాలోని జమాండ్లపల్లి బ్రిడ్జి సమీపంలో కారుకు కుక్క అడ్డురావడంతో తప్పించబోయే క్రమంలో వాహనం పొలాల్లోకి దూసుకెళ్లగా వ్యక్తి, హనుమకొండ హంటర్ రోడ్డులో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటనలతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.

బైక్‌ను మరమ్మతు కోసం తీసుకువస్తుండగా బస్సు ఢీకొని యువకుడు మృతి..



అనిల్‌కుమార్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: తన ద్విచక్రవాహనం పాడైవగా.. మరమ్మతు చేయించేందుకు తీసుకువస్తున్న క్రమంలో స్కూల్ బస్సు ఢీకొని యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగింది. టౌన్ ఎస్సై గోపి కథనం ప్రకారం మహబూబాబాద్ మండలం లక్ష్మీపురం తండా జీపీ పరిధిలోని గమ్యతండాలో నివాసం ఉండే బానోత్ రాజు.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం రేలకాయలపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ అనిల్‌కుమార్ (19) బంధువులు. అనిల్ కుమార్ వారం క్రితం రాజు ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో తన ద్విచక్రవాహనం పాడవడంతో మరమ్మతు చేయించడానికి ఆటోకు తాడు కట్టి అదే వాహనంపై మహబూబా బాద్‌కు వస్తున్నారు. ఆటో, ద్విచక్రవాహనం జిల్లా కేంద్రంలోని అటవీశాఖ అతిథిగృహం వద్దకు చేరుకోగా వారి వెనుక నుంచి వచ్చిన విజ్‌డమ్ (తక్షశిల) పాఠశాల బస్సు అనిల్‌కుమార్ వాహనాన్ని ఢీకొంది. దీంతో యువకుడు బైక్‌పై నుంచి కిందపడగా.. బస్సు అతడి తలపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బావ బానోత్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

కుక్కను తప్పించబోయి అదుపుతప్పిన కారు.. అపస్మారక స్థితికి వెళ్లి ఒకరు..



శ్రీనివాస్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: కుక్కను తప్పించబోయిన కారు.. అదుపుతప్పి బోల్తాడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. రూరల్ ఎస్సై బి.రామ్‌చరణ్ కథనం ప్రకారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన తన్నీరు శ్రీనివాస్ (58).. భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలిసి కొంతకాలంగా వరంగల్‌లోని గిర్మాజీపేట విశ్వకర్మ వీధిలో నివాసం ఉంటున్నారు. వృత్తి రీత్యా జాతకాల రాళ్లు, రోల్డ్‌గోల్డ్ వ్యాపారం చేసే శ్రీనివాస్.. తన కుమారుడు చక్రధర్‌తో కలిసి కారులో మహబూబాబాద్‌కు వచ్చారు. అక్కడ నుంచి భద్రాచలం వెళ్తున్నారు. చక్రధర్ డ్రైవింగ్ చేస్తుండగా శ్రీనివాస్ పక్కనే కూర్చున్నారు. కారు.. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లి బ్రిడ్జి దాటగానే కుక్క అడ్డురావడంతో దానిని తప్పించబోయే క్రమంలో అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో శ్రీనివాస్ అపస్మారకస్థితికి చేరుకోగా చక్రధర్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా శ్రీనివాస్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. ఘటనా స్థలిని రూరల్ ఎస్సై రామ్‌చరణ్, ఏఎస్సై సూరయ్య, పీసీ గౌతమ్ పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్.. ఇద్దరి దుర్మరణం





యువకుల మృతదేహాలు

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. వరంగల్ గాయత్రీనగర్‌కు చెందిన బొంతు అఖిల్ (23), ఎస్‌ఆర్‌ఆర్ తోటకు చెందిన కొలెపాక శ్రీకాంత్(29).. బైక్‌పై వరంగల్ నుంచి హన్మకొండకు వస్తున్నారు. ఈ క్రమంలో హంటర్‌రోడ్డులోని పెట్రోల్‌పంపు వద్ద వేగంగా వస్తూ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో తీవ్ర గాయాలపాలైన ఇద్దరిని ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. దీనిపై బొంతు అఖిల్ బావ పెరుమాండ్ల అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు.